# ఆ రోజులే వస్తే....

ఎండ.

ఆశ్వీయుజం వచ్చినా చినుకుల్ని రాలనీని యెండ. పల్లెలనూ, పొలాలనూ, వాటిని నమ్ముకున్న రైతుల బతుకులనూ నిలువునా కాలుస్తున్న యెండ...

బ్రిటిష్ కాలంలో బాగా యెత్తుగా, దిట్టంగా కట్టిన రామాపురం పోలీస్ స్టేషన్లో నీడ. అధికారపు నీడల్లో సబిన్స్‌పెక్టర్ సుబ్బన్న. సుబ్బన్న మనసులో యెండ! బయటి యెండకంటే తీవ్రంగా, యెదురుపడ్డ జీవినల్లా మాడ్చేటట్లు సుబ్బన్న మనసెండ!

టేబుల్‌మీద కాళ్ళుంచి, స్టేషన్‌కు యెదురుగా పోతున్న బాటవైపు, ఆపైన పూలగడ్డీ, చిక్కు పొదలూ తప్ప యే పచ్చదనమూలేని గుట్టలవైపు, యిటు పక్క శవప్రాయంగా పడివున్న పల్లెవైపు మాటిమాటికి చూస్తున్నాడు. మన సులో మొన్న మొన్న పనిచేసి వచ్చిన కమలాపురం తాలూకాలోని గంగిరెడ్డిపల్లె స్టేషన్. స్టేషన్ కింది పల్లెల్లో చీనీతోటలూ, కొట్లాటలూ, ఖూనీలూ, ఆ కురు క్షేత్రంలో తన ఆదాయమూ మెదలుతున్నాయి.

సుబ్బన్న పరనిందలో, ఆత్మనిందలో పడ్డాడు.

'వెధవ స్టేషన్ ! తెల్ల ముండాకొడుకులకు యేం కారిపోయిందో యీ పోరంబోకు గుట్టల్లో స్టేషన్ పెట్టకపోతే? ఈ నాసిరకం స్టేషనుకూ ఒక సబిన్స్పెక్టరు, ఒక రైటరు, పదిమంది కానిస్టేబుళ్ళు. ఈ వెధవ స్టేషనుంటే మాత్రమేం? తననే ఆ కుర్ర యస్.పి. గాడు ట్రాన్స్ఫర్ చెయ్యాలా ? 'ఖూనీ కేసుల వాళ్ళదగ్గర రెండుచేతులా గుంజడం అనుకున్నావా ? నయాపైసా ఆదాయంలేని గుట్టల్లోకి పంపిస్తున్నా'నని చెప్పి మరీ పంపాడు. పదివేలు ఖర్చుపెట్టుకున్నా లాభం లేకపోయింది. సస్పెన్షన్ తప్పింది. అదైనా మేలే. ఆ ఖూనీ కేసులో తనైనా రెండు పార్టీల దగ్గర గుంజకుంటే బాగుండేది. పిటీషన్లు పెట్టినారు. కోర్టులో సాక్ష్యమిచ్చినప్పుడు జడ్జి చెడామడా చిట్టినాడు. పార్టీలతో 'కన్నైవ్' అయినట్టు 'స్ట్రిక్చరు' పాస్ చేసినాడు. ఛ ఛ !! ఆదాయం పోయింది. బద్వేలు తాలూకాలోని యీ గుట్టల్లోకి వారం రోజులైంది వచ్చి, వొక్క దమ్మిడీ పై సంపాదన లేదు... చూస్తా... చూస్తా...'

సుబ్బన్నకు యెదురుగా బాటమీద వూరివైపు సాగిపోతున్న బండి కనిపించింది. స్టేషన్ వరండాలోకి వచ్చి నిలుచున్నాడు. సుబ్బన్న లాగే యిటీవల స్టేషన్‌కు ట్రాన్స్ఫర్ అయివచ్చిన కానిస్టేబులు కాశీం వరండాలో కునికిపాట్లు పడుతున్నాడు. ఇన్స్పెక్టర్ రావడం చూచి లేచి నిలుచున్నాడు. బండి పరంమీద మూటల్ని సుబ్బన్న నింపాదిగా చూశాడు. యెండలో ముసలి దేశపెద్దులు బండి బరువును లాగలేక, లాగలేక చొంగ కార్చుకుంటూ నెమ్మదిగా యీడుస్తూ ఉండటం చూశాడు. బండి నొగల్లోని ముసలిరైతు యెద్దుల్ని చెలకోలతో బాదుతూ అదిలించలేక అదిలించడం చూశాడు. స్టేషన్‌లో సీనియర్ కానిస్టేబులు కం రైటరు కాశీం ఒక్కడే. జ్ఞాపకం వచ్చింది. మిగతా వాళ్ళనంతా పల్లెల్లోకి తరిమాడు—యే కేసో పట్టుకు రమ్మని.

"రేయి కాశీం !"

"అప్పా !"

"ఆ బండి నక్కడ ఆపి, ముసలోణ్ణి పిల్చుకరా."

కాశీం బండి దగ్గరకు వెళ్ళి బండిని ఆపి ముసలాయనతో మాట్లాడాడు. ముసలాయన దిగి రెండు గాండ్ల కింద రెండు రాళ్ళుపెట్టి, పగ్గాలుకట్టి, కానిస్టేబులు వెంట వచ్చాడు. మాసిన చిరుగుల తువ్వాలుతో చెమట తుడుచుకుంటూ నిలబడ్డాడు.

"బండ్లో యేం సరుకు అది ?"

"జొన్నలు సామీ-అయిదు మూటలు ... మూడు మూటలు పచ్చజొన్నలు ...రెండు మూటలు తెల్లజొన్నలు ... పోయినేడు వానల్లేవు ... యీ యేడు సూస్తున్నారు గదా...యిప్పటికి ఒక సినుకు లేదు. మట్టిలో యిత్తనాలు మట్టిలో కలిసిపోయినాయి. తిండికి సానా అవస్తగా వుంటే ఆమడదూరంలో మా సుట్టాల వూరి నుంచీ గింజలేసుకొని వస్తున్నా...కలికాలం ... యిట్లాగే యింకొక్క యేడు వానదేముడు కళ్ళుమూస్తే వూరిడిసి పోవాల్సిందే. పుట్టిన గడ్డా లేదు. మట్టి గడ్డా లేదు..."

సుబ్బన్న కిదంతా సోదె అనిపించింది. మనసులో యేమూలో క్షణం కలుక్కుమంది. మనసులోని యెండను యే మబ్బుతునకో కమ్మినట్లయింది.

"అయితే యేమంటావు?" అన్యమనస్కంగా అడిగాడు సుబ్బన్న.

ముసలాయనకు పోలీసాయన వాలకం యేమీ అర్థం కాలేదు.

"వస్తా సోమీ—ఈడ నీడలో మీతో మాట్లాడుతూ కూకొనే పురసత్తు నా క్యాడిది? యెండ బతక నీకండా వుంది. యెద్దులు వొగిరించి సస్తున్నాయి. పొద్దు ననగా బయలు దేరితే, యీ ముసలెద్దులకు దూము తగలా, యిప్పటికి వస్తున్నాయి..."

ముసలాయన కదలిపోతూంటే సుబ్బన్న ఆతురతపడి అడిగాడు:

"రెండు మూటలు జొన్నలు దించిపో."

ముసలాయన ఆశ్చర్యంగా చూచి నవ్వుతూ అన్నాడు:

"అమ్మ కోడానికి అనుకున్నారా? అంత రాతా ? మాకు కూటికే సాలటం లేదో బగవంతుడా అనుకుంటా వస్తున్నా."

సుబ్బన్నకు యింకేం మాట్లాడాలో తోచలేదు. కాశింకు 'అప్ప' మనసు అర్థమైంది. వ్యవహారంలోకి దిగాడు:

"సూడు పెద్దయ్యా ! నీ పేరు?"

"సోమయ్య."

"కాపోళ్ళా ?"

"యే కులమైతే యేముంది- నోట్లోకి వేళ్ళు పోనప్పుడు ?"

"నీకు భూమెంత వుంది?"

"పేరుకు పదెకరాలు - వానొస్తేనే."

"చెరువు కింద ?"

"ఒక్క ఎకరా...ఏటీ, యీ యేడు సెర్లో కప్పలకు కూడా తాగడానికి నీళ్ళు లేవు."

"పిల్లలెంత మంది ?"

సుబ్బన్నకు కాశీం, సోమయ్యల కబుర్లు వింటూంటే వళ్ళు మండింది. కాశీం మీద యెగిరి పడ్డాడు:

"యేం పిల్లనిస్తావా? అన్ని ఆరాలు తీస్తున్నావు."

"అది గాదప్పా! మన విషయానికి వస్తున్నా", కాశీం నీళ్ళు నములుతూ అన్నాడు.

వాళ్ళ ధోరణి సోమయ్యకు అనుమానంగా ఉంది.

కాశీం మరొక ప్రశ్న వేశాడు:

"యిదుగో పెద్దాయనా! నీకేం గట్టు తకరార్లు యేమీ లేవా?"

"నాకా? మా బ్రమ్మం రెడ్డి పుణ్యాన యీ పల్లెలో యింతవరకూ యే తకరార్లూ లేవు... అవన్నీ పడమట పల్లెల్లోనే."

యింకేం ప్రశ్నలు వేయాలో కాశీంకు తోచలేదు. మూట జొన్నలైనా యెట్లా దింపుకోవాలో సుబ్బన్నకు అర్థం కాలేదు. తల కొట్టేసినట్లయింది. మొండిగా, సాధికారికంగా:

"ఒక్క మూట తెల్ల జొన్నలు స్టేషన్లో వేసిపో" అన్నాడు.

"యివి అంత మంచి రకంవి కాదు సోమీ. మా బ్రహ్మం రెడ్డిని అడగండి, ధర్మరాజు. కావాలంటే నేనుకూడా సెప్తా."

సోమయ్య అమాయకుడో, తెలిపి మీరినవాడో సుబ్బన్నకు అంతు పట్టలేదు. కాశీం వైపు విసుగ్గా చూశాడు. యిక ప్రయోజనం లేదని కాశీం బండగా తెగేసి చెప్పాడు:

"అయ్యగారికి తెల్ల జొన్న రొట్టెలంటే యిష్టం. ఆ మూటె జొన్నలు వేసిపో. ముందు ముందు యేదన్నా సాయముంటుంది."

"మా బతుకులకు పోలీసోళ్ళు సాయమా? వద్దులే సోమీ... వద్దులే... మా బ్రమ్మంరెడ్డి వున్నంతవరకు. వాన లేకపోయినా మనుషుల సాయముంది."

బాట మీద ఎద్దులు కొమ్ములు గొట్టిన శబ్దం వినిపించింది. ముగ్గురూ అటు వైపు చూశారు. ఎదురుగా మరో బండి... బండ్లో నలుగు రైదుగురు...

"ఈ దాపటెద్దు... దానికి సరక దగలా... ముసలిదయినా యెదురుగా యెద్దు కనిపిస్తే కొమ్ము కొడుతుంది," సోమయ్య బండివైపు పరుగెత్తాడు.

"ముసలి నా కొడుకు," సుబ్బన్న రెండేళ్ళలో తాను రిటయిరయ్యేది మరచి సోమయ్యను తిట్టాడు.

కాశీం తమిద్దరిని కలుపుకుని సానుభూతి వాక్యాలు పలికాడు:

"ఇక్కడంతా యింతేనప్పా... మన జవానులు చెప్పినారు... ఈ రామాపురంలో అంతా కూటికిలేని నా కొడుకులు. పక్కపల్లె నయం... అప్పా! యేమైనా యిది పెద్ద పనిష్మెంటు ప్లేసు."

"చూస్తా... చూస్తా..."

ఇన్‌స్పెక్టరు లోపలికి వెళ్ళి కుర్చీలో కూలబడ్డాడు.

వరండాలో స్తంభానికి ఆనుకుని కాశీం కూచున్నాడు- 'అప్ప' ఆలోచన లేమిటో అనుకుంటూ. 'ఈ ఇన్‌స్పెక్టరు రెండు తరాలు తిని తలంటుకున్నా తరగని ఆస్తిని ఉద్యోగంలోనే సంపాదించినా డ'ంటారు. కడపలో కోఆపరేటివ్ కాలనీలో సంసార ముంది. రెండు బిల్డింగు లున్నాయి. పెద్ద చదువుల్లో పిల్లలు ఉన్నారు. ఇంకా ఆశ యెందుకో... కక్కుర్తి ముండాకొడుకు' అని మనసులో సుబ్బన్నను కాశీం తిట్టుకోసాగాడు.

గదిలో నీడపట్టున సుబ్బన్న కూచున్నాడు. కాళ్ళూ చేతులూ తిమ్మిరి తిమ్మిరిగా ఉన్నాయి. ఈ వారం రోజుల్లో సుబ్బన్న యెవణ్నీ తన్నలేదు. యే దమ్మిడీ చేతికి రాలేదు.

సుబ్బన్న తిమ్మిరెక్కిన చేతుల్ని నలుపుకుంటూ అనుకున్నాడు: 'ఇసుకలో కూడా సుబ్బన్న తైలం తీస్తాడని డిపార్టుమెంట్ లంజకొడుకులు అనుకుంటారు. కానీ యేదీ? యేదీ?? ఈ వూపగడ్డి గుట్టల్లో యేం దొరుకుతుంది?'

ఆ సమయంలో సుబ్బన్నకు బద్వేలు గుట్టలమీద, ఆ రామాపురం స్టేషన్ మీద, మన్నుతిన్న పాముల్లాంటి స్టేషన్ కింది పల్లెల జనం మీద, ఈ శంకరగిరి మాన్యాలకు బదిలీ చేసిన యస్. పి. మీద కసి పుట్టుకొచ్చింది.

సుబ్బన్న ఒకటే ఆలోచనలో పడ్డాడు - తన అధికారం, అది రాల్చినంత డబ్బు! డబ్బు!! ఆలోచిస్తూంటే ఇందాకా రైతు చెప్పిన ధర్మరాజు రెడ్డి-బ్రహ్మం రెడ్డి - మనసులో మెదిలాడు. కానిస్టేబులును పిలిచాడు:

"కాశీం!"

"అప్పా!"

"ఈ వూరి రెడ్డి - అదే బ్రహ్మంరెడ్డి - నిజంగా మంచోడేనా?"

"ధర్మప్రభువు అంటారప్పా అందరూ. ఆ పక్క గుట్టకింద పల్లెలో వుంటాడు... ఒకటి రెండుసార్లు ఇంటికి వెళ్ళా... చానా మర్యాద చేసినారు."

"కరణం?"

"కరణాలు యెక్కడున్నా మామూలే నప్పా! కానీ సాగదు."

"పెద్ద క్రైమ్‌లేమీ రావుగదా యీ స్టేషనుకు?" తాను యిక్కడికి వచ్చే ముందు తెలుసుకున్న విషయాలు నిజమో కాదో తేల్చుకోటానికి అడిగాడు.

"చిల్లర కేసులు కూడా స్టేషనుకు సరిగా రావప్పా! రెడ్డి, కరణం, మునసుబు గారి కింద వుండే మూడు పల్లెల పెద్దలు కేసులు విచారిస్తారు. తప్పు కట్టిస్తారు. వూరుమ్మడి సొమ్ముకు కలుపుతారు. ఆ సొమ్మును శ్రీరామనవమికి ఖర్చు పెడతారు. మనవాళ్ళు అంతా చెప్పినా రప్పా!"

"మరి ఆ తెల్లనాకొడుకులు యీ స్టేషన్ను యెందుకు కట్టినట్లు?" అని సుబ్బన్న వాపోయాడు.

జిల్లాలో గ్రామ పార్టీలుండే ప్రతి వూళ్ళోనూ స్టేషన్ పెట్టకుండా ఇట్లాంటి చోట స్టేషన్ పెట్టినందుకు తెగ బాధ పడిపోయాడు.

"పెద్ద పనిష్మెంటు ప్లేస్!" కాశీం మళ్ళీ గొణుక్కున్నాడు.

"మాటి మాటికి పనిష్మెంట్ అంటూ యెందుకు కూస్తావు? యిన్ని ఆరాలు తీసినోడివి, కేసులు బుక్కుచేసే తెలివి తేటలు చూసుకోకూడదా?"

'అప్ప'కు కాశీం బదులు చెప్పలేదు. ఆ పాటికే సుబ్బన్న మనసులో యీ యిసుక యెడారిలో తైలం యెలా తీయాలో వ్యూహం సిద్ధమైంది.

రామాపురం రెడ్డి బ్రహ్మం రెడ్డినీ, కరణాన్నీ మంచి చేసుకున్నాడు. మరీ పెద్ద కేసుల విషయంలో పోలీసు స్టేషన్ను కూడా దృష్టిలో వుంచుకోవడం ధర్మమని నచ్చచెప్పాడు. బ్రహ్మంరెడ్డి ధర్మాసనం మీద పోలీస్ స్టేషన్ కూడా యికముందు కూచోవచ్చు. తన రాజ్యంలోని యితర పల్లెలతో కూడా సుబ్బన్న సంబంధాలు యేర్పాటు చేసుకున్నాడు.

అంతా బాగుంది కానీ, ఆ యేడు ఆ ప్రాంతమంతా వచ్చిన పెద్దకరువులో ఆ పల్లెల్లో పెద్దగా 'ధర్మోల్లంఘనలు' మాత్రం జరగలేదు. యే ఆడవాళ్ళో వురేసుకొన్న కేసులో, బావుల్లో పడ్డ కేసులో స్టేషను కింది యే పల్లెనుంచీ రాలేదు. యే కొట్లాటలూ స్టేషను దాకా రాలేదు. కాపు సారా కేసులు కూడా దొరికి చావలేదు. దొరికిన చిల్లర కేసుల్లో, స్టేషనుకు కొన్ని కోళ్ళో, కుక్కలో తప్ప యింకేమీ దక్కలేదు. తన వుద్యోగ జీవితంలో సుబ్బన్నకు మొదటి సారిగా ధాత కరువు వచ్చినట్లయింది.

అంతలో పంచాంగం మారింది. కొత్త యేడాదిలో ముంగారువానలు జోరుగా కురిశాయి. పల్లెలనూ, పొలాలనూ నమ్ముకున్న రైతులూ, కూలీల యెండిన బతుకులో చల్లదనం మెల్లిగా చోటుచేసుకుంటోంది. చెరువు నిండింది. పొలాల్లో సందడి. రెండేళ్ళ కరువు కష్టాన్ని మరిచిపోయారా అన్నట్లు ఆశల్లో అందరూ. సోమయ్య అందరితోపాటే!

అరకలు పొలాల్లో కదిలాయి.

సోమయ్య కుటుంబమంతా మెట్టచేలల్లోకి వెళ్ళారు.

ఆ రోజు సోమయ్య, చెరువుకింది తన మడి చెక్కలో దున్నుతున్నాడు. ఒకటి రెండు సాళ్ళు దున్నటం అయింది.

సబిన్స్పెక్టరు సుబ్బన్న, ముగ్గురు పోలీసులు, రెడ్డి, కరణం సోమయ్య మడి దగ్గరకు వచ్చారు. మడి గట్లవార కాసేపు పరకాయించారు. ఆ దృశ్యాన్ని

చూచినా 'యేదోలే' అనుకుంటూ, యెద్దుల్ని అదిలించడంలో సోమయ్య మునిగాడు.

నేరుగా తన మడిలో దిగి, తన దగ్గరకే వచ్చిన వాళ్ళను చూసి యే గొడవో అని సోమయ్య గుండెలు గుబగుబలాడాయి. ముళ్ళ కర్ర కింద వేసి యెద్దుల్ని ఆపాడు.

రెడ్డి నిష్ఠూరంగా మాట్లాడటం మొదలుపెట్టాడు :

"నీకిదేం పోయేకాలమయ్యా? యిన్నేండ్లనుంచీ వొక్క పాడుపని చేసి యెరగవు. యెంత కష్టకాలమొస్తే మాత్రం మడిలో 'భంగాకు' (గంజాయి) గింజలు చల్లుకోడమేనా?"

"యేంది... యేంది నువ్వు సెప్పేది బ్రహ్మంరెడ్డీ?" సుబ్బన్న సబిన్స్పెక్టరు వైపు చూస్తూ అడిగాడు.

"మీ పల్లెలో అందరూ నోట్లో నాలుకలేనోళ్ళే అనుకున్నా, యేడెనిమిది నెలలయింది నేనొచ్చి. వొక్క కేసు లేదా? నన్నిక్కడికి పోస్టు చేసినప్పుడంతా చెప్పినారు — యీ పల్లెల రెడ్డి ధర్మాత్ముడనీ, స్టేషన్‌కు వొక్క కేసు రాదనీ! కానీ మీ కళ్ళల్లో కూడా దుమ్ముకొట్టేవాళ్ళున్నారు. అందుకే పోలీసుస్టేషన్ను పెట్టింది గవర్నమెంటు. యేంచేయాలంటాను? మీరే చెప్పండి... కేసు రాసుకుంటాను. యిది చాలా పెద్ద కేసు", అని సబిన్స్పెక్టరు మర్మంగా అన్నాడు.

రెడ్డి కిదంతా నమ్మశక్యం కాకుండా ఉంది. సోమయ్య మంచితనానికి, సోమయ్య మడిలో వొక వారవారంతా ప్రత్యక్షంగా చూచిన భంగాకు మొక్కలకూ సంబంధం కుదరటం లేదు. పిల్లలు గలవాడు జైలుపాలు కాపడమటుంచి నాలుగు పల్లెల్లో తన రెడ్డిరికాని కెంత అప్రదిష్ట అని బాధపడిపోతున్నాడు.

"యేం కరణమయ్యా, యేం చేయాలంటావు?" అన్నాడు.

"యేముంది? సోమయ్యను యెట్లాగో గట్టున వెయ్యండి. జైలుకు పోతే వెనక్కివచ్చేది ముసలాయన గుడ్డలే," అన్నాడు కరణం.

బద్వేలు భూమి తనఖా బ్యాంకులో సోమయ్య లోను తీసుకున్నప్పుడు తాను తిన్నది జ్ఞాపకం వచ్చి, కరణానికి సోమయ్య మీద జాలిలాంటిదేదో ఆ క్షణంలో కలిగింది.

వాళ్ళ మాటలు సోమయ్యకు అయోమయంగా ఉన్నాయి :

"బంగి గింజలేంది...నా పొలంలోనా? యేంది యిదంతా?..."

కానిస్టేబుల్ కాశిం జబర్దస్తీగా అన్నాడు:

"యేందో నువ్వు చూస్తువురా... నీ గట్టువార భంగాకు వాసన వూళ్ళోకి కొడతాంది."

సోమయ్య యాంత్రికంగా మడిగట్టువద్దకు నడచి, యెన్నడూ చూడని ఆ 'భంగు' మొక్కల్ని చూచి, మడిలోకి వచ్చి అందరి ముందూ కూలబడి, నెత్తి మీద చేతులుంచుకున్నాడు. సోమయ్య స్థితి చూశాక కాశీం గుండె కదిలింది. కానీ అప్ప !

"కేసు వద్దు...యేదో సర్దుకోండి... చాలా మంచి మనిషి," బ్రహ్మంరెడ్డి యిన్‌స్పెక్టర్ సుబ్బన్నవైపు చూస్తూ అన్నాడు.

సుబ్బన్నను కరణం పక్కకు పిలిచి గుసగుస లాడాడు. దగ్గరకు వచ్చి సోమయ్యతో సర్దుబాటుగా అన్నాడు:

"కేసూ వద్దు—వూళ్ళో పంచాయితీ వద్దు. మా అందరికీ నామర్దా పని అది. సోమయ్యా ! అయిదొందలు అపరాధం కట్టు, సరిపోతుంది – నూరు రూపాయలు పూడమ్మడి సొమ్ముకు, నాలుగు నూర్లు స్టేషనుకు."

సోమయ్య అందరివైపు వెర్రిగా చూశాడు.

ధర్మశాసనాధిపతి బ్రహ్మంరెడ్డి సోమయ్యనుచూచి జాలిపడి జోక్యం కలగ జేసుకున్నాడు:

"కరణమయ్యా ! మరీ పెద్దశిక్ష వద్దు. ఏదో పొరపాటు జరిగింది. పూడమ్మడి సొమ్ముకు యాభై కడతాడు. స్టేషనుకు యిన్నూరు. అదీ పాపం, సోమయ్యా దగ్గర యెక్కడుంది? నేను సర్దుతాలే సోమయ్యా, ఆ డబ్బును. పంట పండినాకే యిస్తువు...యింతటితో పోనీండి."

సుబ్బన్న లౌక్యంగా అన్నాడు :

"పెద్ద కేసుల్లో యింత పెద్ద మనస్సుంటే కష్టం. మిమ్మల్ని చూసి మేము అనేదేముంది? మీలాంటి మంచివాళ్ళను చూసి కూడా జనం తప్పుడు పనులు మానరు."

భంగాకు తమ పొలంలోనే యెన్నడూ చూళ్ళేదే ! సోమయ్య పొలంలో యెలా మొలిచింది? యెవరన్నా వేస్తే ఈ పాపం సోమయ్యను చుట్టుకుందేమో ? తామంతా సోమయ్యకు అన్యాయం చేస్తున్నామేమో ? బ్రహ్మంరెడ్డి మనసులో గుంజాటన పడుతున్నాడు. సుబ్బన్న పొగడ్తలకు పెద్దగా పొంగిపోలేదు.

"యింకేం, పదండి—యీ గొడవ యింతటితో మరచిపోవడం మంచిది. సోమయ్యా ! డబ్బు విషయం నే చూస్తాలే. యింట్లో చెప్పి అందర్నీ బాధపెట్టకు."

అందరూ మడిలోంచి కదిలారు. సాగిపోతూ "పాపం, మంచోడు," అంటున్నాడు రెడ్డి.

"అవును సార్, మంచోడిలాగే వున్నాడు," అంటున్నాడు కాశీం. సోమయ్య మెల్లిగా లేచాడు.

ఇన్‌స్పెక్టరు సుబ్బన్న యేదో మరచిపోయినట్లు వెనక్కి వచ్చాడు. సోమయ్య సుబ్బన్నవైపు చూడకుండా పడుకుని నెమరువేస్తున్న దాపటెద్దు వైపు చూశాడు. సుబ్బన్న కుత్సితంగా నవ్వుతూ అన్నాడు:

"ఆ రోజు వొక్క మాట జొన్నలడిగితేనే అమాయకం మొగం పెట్టినావు. ఇప్పుడేమైంది? పోలీసోళ్ళతో వ్యవహారమంటే ఇప్పుడన్నా తెలిసిందా ?"

తానే ఆ బంగి విత్తనాలు చల్లినట్లుమాత్రం సుబ్బన్న చెప్పలేదు. సోమయ్య సుబ్బన్న వైపు కొన్ని క్షణాలు చూశాడు. కింద పడేసిన ముళ్ళకర్ర యెత్తుకున్నాడు. దాపటెద్దును వెర్రిగా బాదుతూ 'ఆకాశం బతకనీదు; మనుషులూ బతకనీరు. నువ్విట్లా నీయమ్మ...నిన్ను నాటుకట్టెల్తో కొట్టాల్నే' అని తిట్లకు లంకించుకున్నాడు.

సుబ్బన్న సోమయ్య కడుపుమంట గ్రహించి విభ్రాంతుడయ్యాడు. ఒక్క క్షణం పిరికి ఆలోచన వచ్చింది. తోటి ధర్మాధికారులవైపు తొందరగా నడుస్తూ వణికిపోతూ అనుకున్నాడు:

'ఆ ముళ్ళకర్ర తనను బాదే రోజులొస్తే ! యెక్కడొస్తాయి ? యెప్పుడొస్తాయిలే...వస్తే !!' ●

○ జనవరి 1979, నివేదిత మాసపత్రిక